

రేపు పాఠశాలలకు సెలవు: డీఈవో

పార్వతీపురం, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు. అధిక వర్షాల నేపథ్యంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాల మేరకు సెలవు ఇస్తున్నట్లుగా జిల్లా విద్యాశాఖ అధికారి పగడాలమ్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పిల్లలను బయటకు పంపించొద్దని, తల్లిదండ్రులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. జిల్లాలో విద్యార్థులంతా ఇంటి పట్టునే ఉండాలని సూచించారు.

తుఫాన్‌పై అప్రమత్తం


● కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ● కంట్రోల్ రూముల ఏర్పాటు ● అధికారులకు సెలవు రద్దు ● ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశం

పార్వతీపురం, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌పై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఎంఎల్‌పీహెచ్‌పీ, సీహెచ్‌డబ్ల్యూలతో సహా ఎవరూ ప్రధాన కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని తెలిపారు. శనివారం కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. వాతావరణ శాఖ హెచ్చ రికల మేరకు ఐదు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సోమవారం విద్యాలయాలకు సెలవు ప్రకటిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. పార్వతీపురం, పాలకొండ ఆర్డీవోల ఆఫీసులతో పాటు అన్ని తహసీల్దార్ల కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఉన్నాయని ఆయన తెలిపారు. కలెక్టరేట్ లోనూ 08963-293046 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, రాక పోకలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించా లన్నారు. ప్రజలు, సరుకులను తరలించడానికి అవసరమై ఇంధనం కోసం పెట్రోల్ బంకులను అనుసంధానం చేయాలని ఆదేశించారు. రోడ్లపై చెట్లు పడిపోతే వెంటనే తొలగించాలని, విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అవసరమైన పరికరాలు, మెషినరీ, కట్టర్స్‌ను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వరదల సమయంలో ప్రజలు పాము, తేలు కాట్లుకు గురయ్యే ప్రమాదం ఉందని, వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటి చికిత్సకు కావాల్సిన మందులు సిద్ధం చేసుకోవాలని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

రైతుల్లో గుబులు

● తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఆందోళన ● పంటలను కాపాడుకునేందుకు అవస్థలు



పార్వతీపురం, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో శనివారం జిల్లావ్యాప్తంగా జోరువాన కురిసింది. ఏజెన్సీ ప్రాంతాల్లోనూ ఓ మోస్తరు వర్షం పడింది. అక్కడక్కడా చిరుజల్లులు పడ్డాయి. తుఫాన్ కారణంగా మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ పనులు ఊపందుకున్న సమయంలో వాతావరణంలో మార్పులు వారిని కలవరపరుస్తున్నాయి. గత నెలలో అడపాదడపా కురిసిన వర్షాలకు జిల్లాలో కొన్నిచోట్ల వరిపొలాలు నీటమునిగాయి. ఇప్పుడిప్పుడే దాని నుంచి బయటపడి రైతులు సాగు పనులు చేపడుతున్నారు. అయితే ఇంతలో మళ్లీ వర్షాలు కురుస్తుం డడంతో పంటలు ఏమైపోతాయోనని దిగులు చెందుతున్నారు. అధిక పెట్టుబడులు పెట్టి ఖరీఫ్ వరి సాగు చేపట్టిన వారు పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. వర్షాల కారణంగా వాగులు, గెడ్డలు ఉప్పొంగితే తమ పంటలు పూర్తిగా ముంపునకు గురయ్యే అవకాశం ఉందని రైతులు వాపో తున్నారు. వరద ఉధృతికి వరినాట్లు కొట్టుకుపోయే పరిస్థితి ఉందని చెబుతున్నారు. దీంతో తీవ్రంగా నష్టాలను చవిచూడాల్సి వస్తోందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే జిల్లాలో నదీతీర, లోతట్టు ప్రాంతాల వాసులు కూడా భయాందోళన చెందుతున్నారు. అధికంగా వర్షాలు కురిస్తే.. తమ పరిస్థితేమిటోనని టెన్షన్ పడుతున్నారు. మరోవైపు జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు లోతట్టు ప్రాంతవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపడుతున్నారు. అన్ని కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కడ ఎటువంటి సమస్య తలెత్తినా.. తమకు తెలియజేయాలని ప్రజలకు సూచిస్తున్నారు.

చివరికి కష్టమేనా?

● అధ్వానంగా వట్టిగెడ్డ రిజర్వాయర్ కాలువలు
● పూడికలు, పిచ్చిమొక్కలతో నిండిన వైనం
● దృష్టి సారించని గత వైసీపీ ప్రభుత్వం
● జైకా నిధులున్నా.. పనులు పూర్తిచేయించలే..
● శివారు భూములకు అందని నీరు
● లబోదిబోమంటున్న రైతులు

జియ్యమ్మవలస: జిల్లాలో ప్రధాన సాగునీటి కాలువలు అధ్వానంగా మారాయి. వాటి ద్వారా శివారు ప్రాంత భూములకు నీరందడం లేదు. దీంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టులు, కాలువల నిర్వహణను గాలి కొదిలేసింది. జైకా నిధులున్నా.. పూర్తిస్థాయిలో పనులు చేయించలేకపోయింది. ప్రధానంగా సాగునీటి కాలువలపై దృష్టి సారించలేదు. ఐదేళ్లలో కనీసం పూడికతీత పనులు కూడా చేపట్టలేదు. దీంతో అధికారులు సాగునీరు విడుదల చేస్తున్నా.. ఎటువంటి ప్రయోజనం ఉండడం లేదు. ఆయా కాలువల ద్వారా పూర్తిస్థాయిలో నీరందక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. జిల్లాలో వట్టిగెడ్డ రిజర్వాయర్ కాలువల పరిస్థితిని ఒకసారి పరిశీలిస్తే..

జియ్యమ్మవలస మండలంలో సాగు, తాగునీరుకు వట్టిగెడ్డ రిజర్వాయరే ఆధారం. దీని కుడి కాలువ పరిధి 9.756 కిలో మీటర్లు. ఆరు డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. వాటి ద్వారా 31.946 కిలో మీటర్ల పరిధిలో 21 పంచాయతీల్లో 13,324 ఎకరాలకు సాగునీరందాల్సి ఉంది. ఇక ఎడమ కాలువ పరిధి 8 కిలో మీటర్లు కాగా దీనికి మూడు డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. వాటి ద్వారా ఏడు పంచాయతీల పరిధిలో 17 కిలో మీటర్ల మేర 3,360 ఎకరాలకు సాగునీరందాల్సి ఉంది. కానీ కాలువలు అధ్వానంగా మారడంతో ప్రస్తుతం 50 శాతం భూములకే నీరందుతోంది. ఈ ప్రాజెక్టు ద్వారా 16,684 ఎకరాలకు సాగునీరందాల్సి ఉన్నా.. ఈ ఖరీఫ్‌కు అటువంటి పరిస్థితి లేకపోయింది. రిజర్వాయర్, కాలువల దారుణ పరిస్థితిపై గత నెల 30న కొంతమంది ముఖ్య నాయకులు, గ్రామస్థులు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను కలిసి నివేదిక అందించారు. కనీసం కాలువల్లో పూడికలు, పిచ్చిమొక్కలు తొలగించాలని కోరారు. దీంతో కలెక్టర్ రూ. 9.7 లక్షలు మంజూరు చేసినా... ఫలితం లేకపోయింది. ప్రస్తుతం నీరు అధికంగా ఉన్నందున ఏ పనులూ చేయలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 11న కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఈ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేశారు. కానీ శివారు భూములకు నీరందని పరిస్థితి ఏర్పడింది. కాలువల నుంచి సరిగ్గా సాగునీరందక పోవడంతో ఆయకట్టుదారులు తలలు పట్టుకుం టున్నారు. ఏటాలానే ఈ ఖరీఫ్‌లో వరుణుడిపై ఆధారపడి సాగు చేపట్టాల్సిందేనా అని వారు ప్రశ్నిస్తున్నారు.


జోగులడుమ్మ వద్ద కాలువ ఇలా..

ఆధునికీకరణ అంతంత మాత్రమే...

జైకా నిధులు రూ. 38 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. 2019లో ఈ ప్రాజెక్టు ఆధునికీకరణకు పరిపాలన ఆమోదం లభిస్తే.. 2020లో సాంకేతిక అనుమతి లభించింది. ఈ ఐదేళ్లలో కేవలం 10 శాతం మాత్రమే పనులు జరిగాయి. ప్రాజెక్టు పరిధిలో కుడి, ఎడమ ప్రధాన కాలువలతో పాటు తొమ్మిది డిస్ట్రిబ్యూటరీలు పూర్తిగా పిచ్చి మొక్కలు, పూడికలతో నిండాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి.. పూర్తిస్థాయిలో సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


చినమేరంగి వద్ద బ్రాంచ్ కాలువ దుస్థితి ఇదీ..

నిధులు మంజూరయ్యాయి..

ప్రాజెక్టుల నిర్వహణ ఫైల్ పెండింగ్‌లో ఉంది. కానీ వట్టిగెడ్డ ప్రాజెక్టు కాలువల పూడికతీతలు, పిచ్చి మొక్కలు తొలగించడానికి కలెక్టర్ రూ.9.7 లక్షలు మంజూరు చేశారు. ప్రస్తుతం నీరు పారుతున్నందున ఏమి చేయాలన్నది ఉన్నతాధికారుల దృష్టిలో తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

– ఉదయభాస్కర్, డీఈఈ

'పనులు గుర్తించండి'

పార్వతీపురం, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పనులు గుర్తించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో గిరిశిఖర, మారుమూల గ్రామాలకు రోడ్ల అనుసంధానం, ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులు, నియోజకవర్గాల వారీగా వాటి పురోగతిపై సమీక్షించారు. రానున్న 15 రోజులకు సంబంధించి పెండింగ్ పనుల పూర్తికి ప్రణాళికలు అందజేయాలని ఆయన ఆదేశించారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఆమోదిం చిన పది కిలోమీటర్ల సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలను పూర్తి చేయా లన్నారు. ఈ ఏడాడికి కోటి 40 లక్షల పనిదినాలు, రూ.241 కోట్లు విలువ చేసే 462 పనులు ఆమోదం పొందాయని డ్వామా పీడీ కె.రామచంద్రరావు తెలిపారు. ప్రస్తుతం రూ.70 కోట్ల మేర పనులు జరుగుతున్నాయని, సుమారు రూ.6 కోట్ల వరకు బిల్లులు చెల్లించామన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా, ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

డీడీ కార్యాలయం సీతంపేటలోనే ...

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సీతంపేట: శ్రీకాకుళం జిల్లాకు డీడీ కార్యాలయం తరలింపుపై గత నెల 27న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తపై అధికారులు స్పందించారు. మరోవైపు ఆదివాసీల డిమాండ్ మేరకు వారు ఓ మెట్టు దిగారు. సీతంపేటలోనే డీడీ కార్యాలయం కొనసాగించే విధంగా చర్యలు తీసుకున్నారు. దీనిపై గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మారిషస్ పైనాపిల్ మొక్కల సరఫరాకు టెండర్లు

సీతంపేట: గిరిజన రైతులకు అందించనున్న మారిషస్ పైనాపిల్ మొక్కల సరఫరాకు సంబంధించి శనివారం స్థానిక ఐటీడీఏలో ఇన్‌చార్జి పీవో వీవీ రమణ ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించారు. ఇందులో 11 మంది పాల్గొన్నారు. సీతంపేట, భామిని మండలాల్లో 110 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా పెంపకం చేపట్టనుండగా, మారిషస్ పైనాపిల్ మొక్కలను మాత్రమే సరఫరా చేయాలని, నాణ్యత లోపించకూడదని పీవో ఆదేశించారు. సంబంధిత అధికారులు కూడా ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు.

ఒక రోజు ముందే.. పింఛన్ల పండగ

● తొలిరోజు 94.93 శాతం మేర పంపిణీ
● లబ్ధిదారుల్లో వెల్లివిరిసిన ఆనందం
● ముందస్తుగా పింఛన్ సొమ్ము అందించిన ఘనత కూటమి ప్రభుత్వం సొంతం
● సీఎం చంద్రబాబు నిర్ణయంపై జిల్లావాసుల హర్షం

పార్వతీపురం, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పింఛన్‌దారులకు ఒకరోజు ముందే పండగ వచ్చింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను శనివారం పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది ఉదయాన్నే నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ మొత్తం అందించారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, కూటమి శ్రేణులు ఇందులో భాగస్వాములయ్యారు. అవ్వాతాతలను పలకరించి పింఛన్ల సొమ్మును అందజేశారు. వాస్తవంగా ప్రతినెలా ఒకటో తేదీన సామాజిక పింఛన్లు ఇవ్వడం ఆనవాయితీ. అయితే ఈనెల ఒకటో తేదీ ఆదివారం కావడంతో సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగులు, పింఛన్‌దారులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా గ్రామాల్లో అందుబాటులేని వారికి సోమవారం నగదు అందించడానికి ఏర్పాట్లు చేశారు. మొత్తంగా సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఒకటో తేదీ రాకముందే పింఛనుదారుల మోములో చిరునవ్వు చిందించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. గతంలో ఏ ప్రభుత్వమూ ఇలా చేయలేదని.. ఒక రోజు ముందుగా పింఛన్లు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని జిల్లావాసులు అభిప్రాయపడుతున్నారు.

94.93 శాతం మేర పంపిణీ

'మన్యం'లో 1,42,866 మంది పింఛన్‌దారులు ఉండగా రూ.59.37 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంది. కాగా 1,35,746 మందికి సుమారు రూ.56.36 కోట్లు పింఛన్ల రూపంలో అందించారు. జిల్లాలో తొలిరోజు 94.93 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తయ్యింది. రాష్ట్రంలో పదో స్థానాన్ని మన్యం దక్కించుకుంది. మండలాల వారీగా చూస్తే.. సీతంపేటలో 97.82 శాతం, మక్కువలో 96.24, పార్వతీపురం అర్బన్ 95.7, పాలకొండ మండలం 95.02, పాచిపెంట 95.3, కొమరాడ 95, గరుగుబిల్లి 94.65, సీతానగరం 94.96, పార్వతీపురం మండలం 94.62, పాలకొండ అర్బన్ 95.1, జియ్యమ్మవలస 95.15, బలిజిపేట 94.33, కురుపాం 94.61, సాలూరు అర్బన్ 94.35, గుమ్మలక్ష్మీపురం 95.22, సాలూరు మండలం 93.42, వీరఘట్టం 93.64, భామినిలో 93.69 శాతం మేర పింఛన్ల పంపిణీ జరిగింది.


పార్వతీపురం రూరల్: బాలగొడబలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

గతంలో ఇలా..

గత వైసీపీ పాలనలో ఏ నెలలో అయినా ఒకటో తేదీ ఆదివారం వస్తే సోమవారం సామాజిక పింఛన్లు పంపిణీ చేసేవారు. ఒకటో తేదీ బ్యాంకుల సెలవు అయితే ఆ తర్వాత రోజు పింఛన్లు అందించేవారు. ఒక్కోసారి బ్యాంకుల్లో పింఛన్ సొమ్ము జమయ్యేది కాదు. దీంతో పంపిణీ మరింత జాప్యమయ్యేది. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రాష్ట్ర ఖజానాను పూర్తిగా ఖాళీగా చేసింది. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం గత రెండు నెలలుగా సచివాలయ ఉద్యోగులతో సకాలంలో పింఛన్లు పంపిణీ చేస్తోంది. ఓ వైపు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూనే.. సక్రమంగా పింఛన్లు అందజేయడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పంపిణీలో ప్రజాప్రతినిధులు, అధికారులు

జిల్లావ్యాప్తంగా జరిగిన పింఛన్ల పంపిణీలో ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములయ్యారు. జిల్లాకేంద్రం పార్వతీపురంలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, పార్వతీపురం మండలం బాలగొడబ, పార్వతీపురం పట్టణ పరిధి కొత్తవలసలో ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గుమ్మలక్ష్మీపురంలో లబ్ధిదారులను కలిసి పింఛన్ల సొమ్ము అందించారు. మొత్తంగా జిల్లాలోని 15 మండలాలతో పాటు పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో పండగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ జరిగింది.


గుమ్మలక్ష్మీపురంలో పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి


వట్టిగెడ్డ వాగు దాటి పుల్లేరుగుడ్డివలసకు వెళ్తున్న జీగిరాం వెల్ఫేర్ సహాయకుడు సుబ్బారావు

కొండలెక్కి.. ఏరు దాటి..

సాలూరు రూరల్: మండలంలో పలువురు సచివాలయ ఉద్యోగులు కొండలెక్కి.. ఏరుదాటి పింఛన్లు పంపిణీ చేశారు. సుమారు ఏడు కిలోమీటర్లు నడిచి.. కొండలెక్కి.. ఏవోబీ పరిధి కొదమ పంచాయతీలో చింతామల, లొద్ద, బందపాయి గ్రామాలకు పంచాయతీ కార్యదర్శి ఎర్రాయుడు చేరుకున్నారు. అక్కడున్న 97 మంది పింఛన్‌దారులకు మధ్యాహ్నంలోగా పింఛను నగదు అందించారు. కొఠియా గ్రూప్ గిరిశిఖర పట్టుచెన్నారు పంచాయతీ డోలియాంబ తదితర గ్రామాలకు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఉదయమే వెళ్లారు. ఇక నెలిపర్తి పంచాయతీ పుల్లేరుగుడ్డివలసకు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ బిడ్డిక సుబ్బారావు వట్టిగెడ్డ దాటి రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లి 20 మందికి పింఛన్లు అందించారు. బొడ్డపాడు, డెన్సరాయి, నారింజపాడు, కరడవలస, బెల్లపాక, మారయపాడు తదితర గిరిశిఖర గ్రామాలకు సచివాలయ ఉద్యోగులు ఉదయాన్నే చేరుకుని పింఛన్లు పంపిణీ చేశారు.


కొండలెక్కి చింతామల గ్రామానికి వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి ఎర్రాయుడు

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
విజయనగరం ఆదివారం • 1 సెప్టెంబరు 2024
cinema@andhrajyothy.com

క్లాప్…

ఓ యువకుడి న్యాయపోరాటం



ప్రియదర్శి కొత్త చిత్రం మొదలైంది. హీరో నాని సమర్పణలో వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై తయారయ్యే ఈ చిత్రానికి ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. రామ్ జగదీశ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రియదర్శిపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు నాని తొలి క్లాప్ ఇచ్చారు. అన్యాయంగా ఒక కేసులో ఇరికించిన ఓ కుర్రాడి కోసం జరిగే న్యాయపోరాటం ఈ చిత్రకథ అని దర్శకుడు చెప్పారు. శివాజీ, సాయికుమార్, రోహిణి, హర్షవర్ధన్, శ్రీదేవి ఇతర ముఖ్యతారాగణం.

సుబ్రహ్మణ్య సాహసాలు



ప్రముఖ నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్ రవిశంకర్ మరోసారి మెగాఫోన్ పట్టారు. తన కుమారుడు అద్వయ్‌ని హీరోగా పరిచయం చేస్తూ 'సుబ్రహ్మణ్య' చిత్రానికి ఆయన దర్శకత్వం వహిస్తున్నారు. తిరుమల్‌రెడ్డి, అనిల్ కడియాల ఈ చిత్రానికి నిర్మాతలు. ఇప్పటికే అరవై శాతం నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న ఈ సినిమాను అడ్వెంచర్ థ్రిల్ అందించడానికి బిగ్ ఫార్మెట్‌లో చిత్రీకరిస్తున్నారు. అద్భుతమైన కథతో గ్రాండ్ విజువల్స్, ఎమోషనల్ ట్రీట్‌తో సినిమా ఉంటుందని దర్శకుడు చెప్పారు. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీత దర్శకుడు. విఘ్నేష్ రాజ్ ఛాయాగ్రాహకుడు.

ఏడాది కిందట



రఘు గద్వాల్ హీరోగా, ప్రియాంక శ్రీ, శివ ప్రసన్న హీరోయిన్లుగా టించిన ప్రేమకథా చిత్రం 'వెంకటలక్ష్మితో' పోస్టర్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. 'ఏడాది కిందట' అనేది ట్యాగ్‌లైన్. రామమూర్తి కొట్టాల దర్శకత్వంలో ఆలేటి రాజేశ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'ఇది స్వచ్ఛమైన ప్రేమకథాచిత్రం. థ్రిల్లర్, సస్పెన్స్ ఎలిమెంట్స్ ఉంటాయి. అంతా కొత్తవారితో తీశాం' అన్నారు దర్శకుడు.

'ప్రణయ గోదారి' పాట



సదన్ హీరోగా, ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటించిన 'ప్రణయ గోదారి' చిత్రం నుంచి 'గు గు గ్గు' అంటూ సాగే హుషారైన పాటను ప్రముఖ కొరియోగ్రాఫర్ గణేశ్ విడుదల చేశారు. మార్కండేయ రాసి స్వరపరిచిన ఈ పాటను భార్గవి పిళ్లై పాడారు.ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత పారమళ్ల లింగయ్య చెప్పారు. పి.ఎల్.విఘ్నేశ్ ఈ చిత్రానికి దర్శకుడు.

అమ్మగా నటించడానికి ఇబ్బంది పడలేదు

ఇప్పుడు సొసైటీలో 22 ఏళ్లకే పెళ్లి ఎప్పుడు అని అడుగుతున్నారు. అందుకే నేను హౌస్ వైఫ్‌గా, అమ్మగా నటించడానికి ఇబ్బంది పడలేదు. నటిగా అన్ని పాత్రలూ చేయాలి. అయితే తల్లిగా బాగా చేశావు అనేకంటే సరస్వతి పాత్రను చక్కగా పోషించావని అంటే సంతోషిస్తా' అన్నారు నివేదా థామస్. రానా సమర్పణలో రూపుదిద్దుకున్న '35.. చిన్న కథ కాదు' చిత్రం ఈ నెల ఆరున విడుదలవుతున్న సందర్భంగా శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఇందులో సరస్వతి పాత్రకు, నాకు వయసులో పెద్ద తేడా లేదు. సరస్వతి నాకంటే ఏడాది చిన్నది. తనకు పెళ్లయి పిల్లలు ఉన్నప్పటికీ చైల్డ్ నేచర్ ఉంటుంది. '35 చిన్న కథ కాదు.. కథని దర్శకుడు నందకిశోర్ అద్భుతంగా రాశారు. తిరుమల వేంకటేశ్వర స్వామి కూడా ఈ కథలో ఓ పాత్ర పోషించారు. ఆ డివైన్ ఫీలింగ్ అన్ని సీన్స్‌లో ఉంటుంది. ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే సినిమా అవుతుంది' అన్నారామె. 'ఇందులో తిరుపతి స్లాంగ్ కోసం దాదాపు నెల రోజులు వర్క్‌షాప్ చేశాం. పతి పదాన్నీ క్షుణ్ణంగా నేర్చుకున్నా' అని చెప్పారు నివేద. గౌతమి కీలక పాత్ర పోషించారనీ, ఆమెతో నటించడం ఇది రెండోసారని నివేద చెప్పారు. కొత్త ప్రాజెక్టులు ఏవీ ఒప్పుకోలేదని, త్వరలోనే చెబుతానని అన్నారు.



ఈ సక్సెస్‌తో ఆ వెలితి తీరింది

'పదిహేను రోజులుగా మా టీమ్‌లో ఎవరికీ సరిగ్గా నిద్ర లేదు. రిలీజ్ రోజు నుంచి ఎన్నో అభినందనలు, ప్రశంసలు వస్తున్నాయి. సినిమా బాగుంటే ప్రేక్షకుల తల మీద పెట్టుకుంటారని మరో సారి నిరూపించినందుకు కృతజ్ఞతలు. ఇంత వర్షంలో కూడా అన్ని చోట్లా హౌస్‌ఫుల్స్ అవుతున్నాయి. 'అంటే సుందరానికి' రావాల్సిన బాక్సాఫీసు సక్సెస్ రాలేదనే చిన్న వెలితి ఉండేది. 'సరిపోదా శనివారం'తో అది బ్యాలెన్స్ అయింది. 'నిన్ను కోరి' తర్వాత దానయ్యగారితో రెండో సినిమా. మా మూడో సినిమాపై



అంచనాలు భారీగా ఉంటాయి. దానికి తగ్గ సెటప్ చేద్దాం. సెప్టెంబర్ 5న ఈ సినిమా గ్రాండ్ సెలబ్రేషన్స్ ఈవెంట్ ఉంటుంది' అన్నారు హీరో నాని. శనివారం జరిగిన 'సరిపోదా శనివారం' థాంక్స్ మీట్‌లో ఆయన మాట్లాడారు. దర్శకుడు వివేక్ ఆత్రేయ మాట్లాడుతూ 'నా మీద నాకున్న నమ్మకం కంటే నా మీద నానికి నమ్మకం ఎక్కువ. ఆయన ఫ్రీడమ్ ఇచ్చారు కనుకే ఇలాంటి మంచి సినిమా వచ్చింది. ఇంత భారీ చిత్రాన్ని నేను హ్యాండిల్ చేయగలనని నమ్మి భారీ బడ్జెట్ పెట్టిన దానయ్యగారికి థాంక్స్. తొలి సినిమాతోనే పెద్ద హిట్ కొట్టిన కల్యాణ్‌కు అభినందనలు' అన్నారు. 'ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లోనే సినిమా పెద్ద హిట్ అవుతుందని చెప్పాను. ఈ రోజు రిజల్ట్ అలాగే ఉంది' అన్నారు దానయ్య.

అమ్మ కల నెరవేరింది



సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ శనివారం కర్ణాటకలోని ఉడుపి శ్రీకృష్ణమఠాన్ని సందర్శించారు. తన తల్లి శాలిని, భార్య లక్ష్మీ ప్రణతితో కలసి ఆయన ఉడుపికి వెళ్లారు. 'మా అమ్మ ఎప్పుడూ తన సొంతూరు కుందాపురాతో పాటు ఉడుపి శ్రీకృష్ణుని దర్శనానికి తీసుకెళ్లమని అడుగుతుంది. ఇన్నాళ్లకు అమ్మ కల నెరవేరింది. సెప్టెంబర్ 2న అమ్మ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆమెకు నేను ఇచ్చే బహుమతి ఇదే' అని ఎన్టీఆర్ తెలిపారు. ఇటీవల జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు పొందిన 'కాంతార' ఫేం రిషబ్ శెట్టి, దర్శకుడు ప్రశాంత్ నీల్ వారిని సాదరంగా ఆహ్వానించారు. ఆ తర్వాత శ్రీకృష్ణ మఠంలో అందరూ పూజలు నిర్వహించారు.

బెంగళూరు, (ఆంధ్రజ్యోతి)

మా జీవితాల్ని మార్చిన సినిమా



హరీశ్ శంకర్ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ హీరోగా రూపొందిన 'గబ్బర్‌సింగ్' చిత్రం ఆయన పుట్టినరోజు సందర్భంగా సోమవారం రీ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో బండ్ల గణేశ్ మాట్లాడుతూ 'నా తల్లితండ్రులు నాకు జన్మనిస్తే పవన్‌కల్యాణ్ బతుకునిచ్చారు. నన్ను నేను నమ్మలేని స్థితిలో ఉన్నప్పుడు ఆయన పిలిచి 'గబ్బర్‌సింగ్ 'సినిమా ఇచ్చి నన్ను నిలబెట్టారు. ఈ చిత్ర దర్శకుడు హరీశ్ శంకర్ రాబోయే పాతికేళ్లు తెలుగు చిత్రపరిశ్రమలో నంబర్ వన్‌గా ఉంటారు' అని చెప్పారు. 'సోషల్ మీడియా విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న ఈ రోజుల్లో 'గబ్బర్‌సింగ్' రిలీజ్ అయి ఉంటే ఎంత బాగుండేదో అనే వెలితి నా మనసులో ఉండేది. ఇప్పుడు ఆ సినిమా రీ రిలీజ్‌తో అది తీరుతోంది. మా జీవితాలను మార్చేసిన సినిమా 'గబ్బర్‌సింగ్'' అని హరీశ్‌శంకర్ చెప్పారు.

అన్ని రంగాల్లో ఉన్నదే సినీ పరిశ్రమలోనూ జరుగుతోంది

- లైంగిక వేధింపులపై మోహన్‌లాల్ స్పందన
- నేనెవరికీ వత్తాసు పలకలేదు

'సమాజంలో సినీరంగం కూడా ఒక భాగం. అన్ని రంగాల్లో ఉన్నట్లే సినీ రంగంలోనూ లైంగిక వేధింపులు ఉన్నాయి. పరిశ్రమలో తలెత్తే ప్రతి సమస్యకు బాధ్యత వహించాల్సిన అవసరం అమ్మ (అసోసియేషన్ ఆఫ్ మలయాళ మూవీ ఆర్టిస్ట్స్)కు లేదు' అని మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్ అన్నారు. 'అమ్మ'కు రాజీనామా చేశాక శనివారం ఆయన తొలిసారి మీడియా ముందుకొచ్చారు. 'హేమ కమిటీ నివేదికను స్వాగతిస్తున్నాం, కేరళ ప్రభుత్వం, పోలీసులు నివేదికపై దర్యాప్తు చేస్తున్నందువల్ల నిజం తేలేవరకూ ఓపికపట్టాలి, పరిశ్రమ 'పేరును చెడగొట్టొద్దు' అని ఆయన మీడియాకు విజ్ఞప్తి చేశారు. 'ఫిల్మ్ ఇండస్ట్రీలోని పవర్ గ్రూప్ గురించి నాకు తెలియదు. ఇలాంటిది ఒకటుందని హేమ కమిటీ చెబితేనే విన్నాను. ఏ పవర్ గ్రూప్‌తోనూ నాకు సంబంధం లేదు. సినీ పెద్దలకు అండగా నిలుస్తున్నట్లు నాపై అసత్యాలను ప్రచారం చేస్తున్నారు. పరిశ్రమలో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాల్సిందే, ఆ విషయంలో పోలీసులకు సహకరిస్తాం' అని స్పష్టం చేశారు. పరిశ్రమలో ఎన్నో అసోషియేషన్లు ఉండగా, ఏం జరిగినా 'అమ్మ'పైన రుద్దేప్రయత్నం చేస్తుండడం దురదృష్టకరమన్నారు. మహిళలపై వేధింపుల విషయంలో మొత్తం చిత్ర పరిశ్రమ బాధ్యత తీసుకోవాలి కానీ కావాలనే అమ్మను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. 'వేలాది మందికి ఉపాధిని కల్పిస్తోన్న మలయాళ చిత్ర పరిశ్రమ కుటుంబం లాంటిది. దయచేసి దాన్ని లక్ష్యంగా చేసుకోవద్దు. పరిశ్రమను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. అందరూ సంయమనం పాటించాలి' అని మోహన్‌లాల్ కోరారు. 'అమ్మ' కార్యవర్గం రాజీనామా వైఫల్యం





కాదు, బాధ్యతల నుంచి మేం పారిపోలేదు. మా స్థానంలో కొత్త కార్యవర్గం వచ్చి అమ్మను సమర్థవంతంగా నడుపుతుంది' అని తెలిపారు. బాధ్యతల నుంచి నేనెప్పుడూ పారిపోలేదు, అత్యవసర పనుల వల్ల ఇప్పటివరకూ మీడియా ముందుకు రాలేకపోయాను అని మోహన్‌లాల్ చెప్పారు.

సీక్రెట్ కెమెరాలు పెట్టారు - నటి రాధిక ఆరోపణ

మాలీవుడ్‌లో కేరవాన్‌లలో రహస్య కెమెరాలు అమర్చి హీరోయిన్లు దుస్తులు మార్చటాన్ని వీడియో తీసిన ఘటనలు జరిగాయని, అలాంటి వీడియోలను సినీ యూనిట్ సభ్యులు వీక్షించడాన్ని తాను స్వయంగా గమనించానని సీనియర్ సినీనటి రాధిక శరత్‌కుమార్ ఆరోపించారు. కేరవాన్‌లలో కెమెరాలు అమర్చుతున్నారని తెలిసిన తర్వాత తాను హోటల్ గదుల్లో దుస్తులు మార్చుకున్నానని చెప్పారు. ఆమె ఓ తమిళ టీవీ ఛానెల్‌తో మాట్లాడుతూ.. సినీ పరిశ్రమ విధానమే సక్రమంగా లేదని, మగవారెవరూ హీరోయిన్లకు, నటీమణులకు మద్దతుగా మాట్లాడటం లేదని వాపోయారు. హీరోయిన్ల గది తలుపులు తట్టే పరిస్థితులు అన్ని సినీ విభాగాల్లో ఉన్నాయన్నారు. లైంగిక వేధింపులను ఎదుర్కొనే ధైర్యాన్ని మహిళలు మరింత పెంచుకోవాలని ఆమె సూచించారు.

నాకు ఎవరూ ఫొటోలు పంపలేదు

సజీర్ అనే వ్యక్తి నగ్న చిత్రాలను ఫోన్‌లో చిత్రీకరించి వాటిని నటి రేవతికి పంపినట్లు మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. సినిమాల్లో అవకాశం ఇస్తానని తనపై దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ లైంగిక దాడికి పాల్పడినట్లు సజీర్ అనే వ్యక్తి ఇటీవలే ఆరోపించాడు. ఆ సంఘటన జరిగిన రోజు నటి రేవతి కూడా హోటల్ రూమ్‌లో ఉన్నట్లు రంజిత్ చెప్పినట్లు సజీర్ తెలిపాడు. ఈ ఆరోపణలపై రేవతి స్పందించారు. మీడియాలో తనపై జరుగుతున్న ప్రచారంలో నిజం లేదన్నారు. తనకు ఎవరూ ఎలాంటి ఫొటోలను పంపలేదని స్పష్టం చేశారు. మరోసారి దీని గురించి మాట్లాడాల్సిన అవసరం తనకు లేదని రేవతి పేర్కొన్నారు.

నిర్వహణ లేక... శిథిలావస్థకు చేరి

- పిచ్చిమొక్కలు, వర్షం నీరు నిల్వ
- బయటకు కనిపిస్తున్న ఇనుప ఊచలు
- ఇదీ నాగావళిపై సంకిలి వంతెన దుస్థితి

రేగిడి: రేగిడి మండలంలోని సంకిలి వద్ద నాగావళి నదిపై గల వంతెన నిర్వహణకు నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరింది. ప్రధానంగా సిమెంటు కట్టడాలు దెబ్బతిని ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. అంతేకాకుండా అధికారుల నిర్లక్ష్యం వల్ల పిచ్చిమొక్కలు బాగా పెరగడంతోపాటు వంతెనపై వర్షం నీరు నిల్వ ఉంటోంది.

అడుగడుగునా గోతులు..

పాలకొండ- విశాఖ ప్రధాన మార్గంగా ఉండడం, ఒడిశాను కలిపే కీలక రహదారి మార్గం కావడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. నాలుగు దశాబ్దాల కిందట అప్పటి ముఖ్యమంత్రి టి.అంజయ్య కాలంలో వంతెనను నిర్మించారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన వంతెన నిర్వహణలోపం పుణ్యమాని అనతికాలంలో ప్రమాదకర స్థితికి చేరుకుంది. ప్రధానంగా వంతెనపై అడుగడుగునా గోతులమయంకావడంతో వాహన చోదకులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు.వంతెన ఏర్పాటుచేయడంతో అప్పటి విజయనగరం, శ్రీకాకుళం జిల్లా ప్రజలకు రవాణా సదుపాయాలు మెరుగుపడ్డాయి. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని రేగిడి, వంగర, పాలకొండ, రాజాం, వీరఘట్టం తదితర మండలాలతోపాటు అంతర్రాష్ట్ర రహదారిగా ప్రసిద్ధిచెందింది. అప్పట్లో ఒడిశా వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం కావడం విశేషం. కాలక్రమేణా ఈ వంతెన నిర్వహణపై ఆర్అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడంతో దెబ్బతింది. ప్రధానంగా ఇరువైపులా రైలింగ్‌లు పాడయ్యాయి. వంతెనపై మట్టి పేరుకుపోవడంతో వర్షం కురిస్తే నీరు చేరడంతో వాహనచోదకులు ఇబ్బందిపడేవారు. అంతేకాకుండా నీరు రోజుల తరబడి నిల్వ ఉండడంతో అక్కడక్కడ రోడ్డు పాడైంది. దీనికితోడు రెయిలింగ్‌పై పిచ్చిమొక్కలు పెరగడంతో వంతెన బీటలు వారింది. చివరకు వర్షంనీరు బయ టకు వెళ్లిపోయేలా నిర్మించిన రంధ్రాలు ముసుకుపోయినా వాటి నిర్వహణపై చర్యలు తీసుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. అయితే ఇటీవల వంతెనపై తారు పూసి తూతూమంత్రంగా మరమ్మతులు చేయడంతో మళ్లీ గోతులు ఏర్పడ్డాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకముందే తక్షణమే మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు. కాగా నిధులు కొరత ఉందని, నిధులు వస్తే వంతెన నిర్వహణచర్యలు చేపడతామని పాలకొండ ఆర్అండ్‌బీ ఏఈ జగన్మోహనరావు తెలిపారు.



శిథిలావస్థకు చేరిన సంకిలి వంతెన

పింఛన్ తీసుకునేందుకు వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

గంట్యాడ: పింఛన్ డబ్బులు తీసుకునేందుకు స్వగ్రామానికి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని గింజేరు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గింజేరు గ్రామానికి చెందిన ఎం.అప్పలనాయుడు(63) కొద్ది సంవత్సరాలు నుంచి విశాఖలోని గోపాలపట్టణం పరిధిలోగల ఓ యాజమాని వద్ద పశువులు పెంచుతూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం పింఛన్ డబ్బులు తీసుకునేందుకు స్వగ్రామం గింజేరుకు శుక్రవారం గోపాలపట్టణం నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఆనందపురం సమీపంలోని గండికొండ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. దీంతో గాయాపాలైన అప్పలనాయుడును 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో మృతిచెందాడు. సమాచారం అందుకున్న కుటుంబీకులు విశాఖ కేజీహెచ్‌కు చేరుకుని, మృతదేహాన్ని శనివారం స్వగ్రామానికి తీసుకువచ్చారు.

అనారోగ్యంతో వృద్ధుడు..

ఇదిలాఉండగా.. ఇదేగ్రామానికి చెందిన డి.శ్రీరాం(65) శనివారం ఉదయం పించన్ డబ్బులు తీసుకున్నాడు. అప్పటికే అనారోగ్యంతో ఉన్న ఆయన మృతిచెం దాడు. రెండుమృతదేహాలకు ఒకేరోజు అంతిక్రియలు నిర్వహించారు. దీంతో కుటుం బీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామంలోని విషాదఛాయలు అలముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్..

పాచిపెంట: మండలంలోని కంకణాపల్లి సమీపంలో గల ఘాట్ రోడ్డు జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో కాకినాడకు చెందిన లారీ డ్రైవర్ చెట్లపల్లి తాతారావు (58) మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. నవరంగపూర్ నుంచి కాకినాడకు దాణా లోడుతో వెళ్తుండగా కంకణాపల్లి వద్ద ముందున్న లారీని ఢీకొట్టింది. దీంతో క్యాబిన్ నుజ్జునుజ్జుకావడంతో డ్రైవర్ తాతారావు రెండు కాళ్లు విరిగిపోయి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో డ్రైవర్ తాతారావు అక్కడికక్కడే మృతిచెందాడు. తాతారావు కుమారుడు విజయకుమార్ ఫిర్యాదు మేరకు హెచ్‌సీ సమర్పణరావు కేసు నమోదు చేశారు.

రేగిడి హెడ్ కానిస్టేబుల్ ..

రేగిడి/వంగర: రేగిడి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వంగర మండలం తలగాం గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ పైల నారాయణరావు(53) శుక్రవారం రాత్రి మృతిచెందాడు. ఆయన కొంతకాలంలో అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య పార్వతి, ఇద్దరుపిల్లలు సాయి, సిరి ఉన్నారు. నారాయణరావు మృతిపై రాజాం సీఐ ఉపేంద్ర, రేగిడి పోలీస్‌సిబ్బంది సంతాపం తెలిపారు. పోలీస్ లాంఛనాలతో తలగాంలో అంత్యక్రియలు పూర్తిచేసినట్లు పోలీస్‌వర్గాలు వెల్లడించాయి.

దేవాడలో బాణసంచా నిల్వల స్వాధీనం

కొత్తవలస: మండలంలోని దేవాడలో దాసరి పెంటయ్య ఇంటి పక్కన గల ఖాళీ స్థలంలో బాణసంచా అక్రమంగా నిల్వఉన్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కొత్తవలస సీఐ షణ్ముఖరావు పరిశీలించారు. ఈ మేరకు అనుమతి లేకుండా బాణసంచా నిల్వఉంచడంతో సామగ్రిని స్వాధీనం చేసుకుని దాసరి పెంటయ్యాపై కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుని అరెస్టు చేసినట్లు చెప్పారు.

59 మందికి పోలీసుల కౌన్సెలింగ్

కొత్తవలస: కొత్తవలస పోలీసుస్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీ షీటర్లు, చెడు ప్రవర్తన గల 59 మందికి స్టేషన్‌లో సీఐ షణ్ముఖరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. రానున్న వినాయక చవితితో పాటు వివిద పండగల్లో చట్ట వ్యతిరేక పనులు చేపడితే తీవ్ర పరిణామలు ఎదుర్కొన వలసి ఉంటుందని హెచ్చరించారు.

నవంబరు 27 నుంచి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు



మహాసభల లోగో ఆవిష్కరిస్తున్న అశోక్ గజపతిరాజు

విజయనగరం దాసన్న పేట: విజయనగరంలో నవంబరు 27 నుంచి 30వ తేదీ వరకూ నిర్వహించే ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలకు విద్యార్థులు, మేధావులు, కవులు హాజరై జయప్రదం చేయాలని ఆ సంఘరాష్ట్ర మహాసభల గౌరవాధ్యక్షుడు కామేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం విజయనగరంలో మహాసభల లోగోను కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జగదీష్, టీడీపీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, సీపీఐ ప్రతినిధులు అశోక్, రంగరాజు, మేనేజరు ఇబ్రహీం పాల్గొన్నారు.

యూపీఎస్ రద్దుచేయాలి

బొబ్బిలి రూరల్: కేంద్రప్రభుత్వం ప్రకటించిన ఏకీకృత పెన్షన్ పథకం (యూపీఎస్) రద్దుచేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయగౌరి కోరారు. శనివారం బొబ్బిలిలో తహసీల్దార్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆనెం శ్రీనివాస్, సత్యనా రాయణ, స్వామి నాయుడు, వెంకటరావు, కృష్ణదాసు పాల్గొన్నారు.

పనిలో సమగ్రత పాటించాలి

విజయనగరం రూరల్: విద్యార్థులుచేసే పనిలో సమగ్రత పాటించాలని రిసోర్స్ పర్సన్ ప్రొఫెసర్ జాస్తి ఆనంద్ చందూలాల్ తెలిపారు. శనివారం జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో కానిస్టేష్యువల్ లెర్నింగ్ టెక్నిక్‌అన్న అంశంపై వర్క్ షాపు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ నాగరాజుతోపాటు, వివిధ విభాగాధిపతులు, అసిస్టెంట్ పాల్గొన్నారు

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు: సీఐ

రాజాం/ రూరల్: ట్రాఫిక్ నియంత్రణకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ హెచ్చరించారు. శనివారం పట్టణంలో ఆటో డ్రైవర్లతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఇష్టారాజ్యంగా ఆటోలను నిలిపివేసి రాకపోకలకు అంతరాయం కలిగిస్తే సహించేది లేదన్నారు. కాగా ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు సీఐను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రవికిరణ్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా గోస్తనీ తీరం నుంచి ఇసుక రవాణా

శృంగవరపుకోట రూరల్: మండలంలోని గోస్తనీ నదీ తీరం నుంచి ఇసుక యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. కొట్టాం, కొత్తకోట, మామిడిపల్లి, వేముపల్లి ప్రాంతాల పరిధిలో రాత్రిపట్టపగలు అన్న తేడాలేకుండా ఇసుక తరలిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం ఎస్.కోట, గంట్యాడ మండలాలకు చెందిన కొందరు ఇసుకను అక్రమంగా తరలించారు. ఉదయం నుంచి రాత్రి వరకు నాటుబండ్లతో ఇసుకను సేకరించి రాత్రివేళల్లో ఎస్.కోట, గంట్యాడ మండలంలోని పలుగ్రామాలకు ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఇసుక రవాణాపైప్రశ్నిస్తే దాడులకు సైతం దిగుతున్నారు కాగా తీరప్రాంతంలో నిఘా ఏర్పాటుచేస్తామని తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు.

బొబ్బిలిలో భారీ వర్షం

బొబ్బిలి: బొబ్బిలిలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో పలు ప్రధాన వీధులు జలమయమయ్యాయి. ఎనిమిదో వార్డు పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటలకు విద్యు త్‌సరఫరానిలిచిపోవడంతో వినియోగదారులు అవస్థలుపడ్డారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని ఏఈ సాంబశివరావు తెలిపారు.

'ఎస్సీ వర్గీకరణ అమలుచేయాలి'

బాడంగి: రాష్ట్రప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలుప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు కిల్లాడ సురేంద్రబాబు కోరారు. శనివారం బాడంగిలో ఎమ్మార్పీఎస్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కండి రమేష్, బోగి బాలరాజు, అరసాడ ప్రకాశం, కిల్లాడ మురళి, కండి సోములు పాల్గొన్నారు.

విజయనగరంలో అల్ హాజరత్ ఉత్సవాలు

విజయనగరం రూరల్: జిల్లాలోని ముస్లిములు అల్ హాజరత్ ఉత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని అబాద్‌వీధి తదితర ప్రాంతాల్లో ముస్లిములు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఇమామ్‌లు హజరత్ చేసిన త్యాగాలను వివరించారు. కార్యక్రమంలో ఎండీ సలామ్, ఎస్‌కే మస్తాన్, మహ్మద్ బహార్, సయ్యద్ ఆరీఫ్‌ఖాన్, షేక్ అన్వర్, ఎండీ షఫీ, షేక్ రహీమ్, ఎస్‌కె మౌలానా, మహ్మద్ గౌస్, హానీజ్‌లు పాల్గొన్నారు.



బొబ్బిలి: మట్టి వినాయకుని ప్రతిమను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన



రాజాం: మట్టి ప్రతిమను పంపిణీ చేస్తున్న కోండ్రు మురళీమోహన్

పర్యావరణాన్ని పరిరక్షించండి

మట్టితో తయారు చేసిన మట్టి ప్రతిమలతో పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని బొబ్బిలి, రాజాం ఎమ్మెల్యేలు బేబీనాయన, కోండ్రు మురళీమోహన్ పిలుపునిచ్చారు. శనివారం బొబ్బిలి, రాజాంలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు.

- **బొబ్బిలి:** చెరువులు కాలుష్యంబారిన పడకుండా కాపాడుకోవాలని ఎమ్మెల్యే బేబీనాయన పిలుపునిచ్చారు. బొబ్బిలి తారకరామాకాలనీలో అభిమాని ఫౌండేషన్ చైర్మన్ రెడ్డి రాజగోపాలనాయుడు, స్పార్క్ సొసైటీ అధ్యక్షుడు పద్మనాభం సంయుక్త ఆధ్వర్యంలో రెండువేల మట్టి వినాయకులను పంపిణీ చేశారు.కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు సుంకరి సాయిరమేష్‌అవేర్‌సంస్థ అధ్యక్షుడు పెద్దింటి మనోజ్‌కుమార్, చెలికాని కేశవ పాల్గొన్నారు.
- **రాజాం:** రసాయనాలతో తయారు చేసిన వినాయక ప్రతిమలు నీటిలో నిమజ్జనం చేయడవల్ల జల కాలుష్యం ఏర్పడుతుందని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. రాజాంలోని శ్రీకాకుళం రోడ్డులో వికాసత రంగనీ ఆధ్వర్యంలో మట్టివిగ్రహాలు పంపిణీచేశారు.కార్యక్రమంలో టీటీవీ రమణమూర్తి, నారాయణరావు, సూర్యప్రకాష్‌రావు,శ్రీనివాసరావు, లక్ష్మణరావు, వెంకటరావు, రాజేష్‌కుమార్, నాగరాజు, టంకాల కన్నంనాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రతిపాదనలు అజెండాలో చేర్చకపోవడంపై నిలదీత

- వాడీవేడిగా బొబ్బిలి మునిసిపల్ పాలకమండలి సమావేశం



వైసీపీ కౌన్సిలర్లతో వాగ్వాదం చేస్తున్న శరత్‌బాబు

బొబ్బిలి: పలు అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యే బేబీనాయన చేసిన ప్రతిపాదనలను బుట్టదాఖలు చేయడంపై ఎనిమిదో వార్డు కౌన్సిలరు రాంబార్కి శరత్‌బాబు ధ్వజమెత్తారు. శనివారం మునిసిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు అధ్యక్షతన పాలకమండలి సమావేశం వాడీవేడిగా జరిగింది.తొలుత శరత్‌బాబు మాట్లాడుతూ రెండు నెలలుగా ఎమ్మెల్యే ప్రతిపాదనలను మునిసిపల్ అజెండాలో ఎందుకు చేర్చడంలేదని చైర్మన్, అధికారులను నిలదీశారు.ఆర్టీసీకాంప్లెక్స్ కూడలి నుంచి పూల్‌బాగ్, బైపాస్ రోడ్డుమీదుగా గొల్లపల్లి వరకు రోడ్డు కోసం రూ.40 లక్షల మునిసిపల్ నిధులను వెచ్చించారని, ఆ నిధులు ఏమయ్యాయని నిలదీశారు. ఈవిషయంపై విజిలెన్స్ అధికారులకు లేఖరాస్తామని శరత్‌బాబు హెచ్చరించారు. ఎమ్మెల్యే సొంత నిధులతో పనులు చేయిస్తామని ప్రైవేట్ మీడియాలో చూశామని, అందుకే తాము ప్రతిపాదించలేదని మున్సిపల్ చైర్మన్ బదులిచ్చారు. దీనిపై శరత్‌బాబు, ఫ్లోర్‌లీడరు గెంబలి శ్రీనివాసరావు, వెలగాడ హైమావతి, కాకల గోవిందమ్మలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. పట్టణంలోని రోడ్ల దుస్థితిపై దృష్టిసారించాలని డిమాండ్ చేశారు. వైస్‌చైర్‌పర్సన్ గొలగాని రమాదేవి, కౌన్సిలరు ఇంటి గోవిందరావు టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు, కౌన్సిలర్లపై కనీసం గౌరవమర్యాదలు లేవని ప్రశ్నించారు. డెంగ్యూ జ్వరాల నివారణపై మున్సిపల్ యంత్రాంగం పట్టించుకోవడం లేదని రాంబార్కి ఆరోపించారు. ఒక్కో కుక్కల ఆపరేషన్‌కు రూ. వెయ్యి చొప్పున కేటాయించడం హాస్యాస్పదంగా ఉందని, దీనిపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు అంశాలపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో మునిసిపల్ మేనేజరు బీఎండీ శివప్రసాద్, ఆర్వో ప్రసాదరావు, ఏఈలు సురేష్, రవి, ఆర్‌ఐలు సురేష్‌బాబు, త్రినాథ, టీపీఆర్‌ఓ జగన్మోహన్ పాల్గొన్నారు.

పాత పద్ధతిలో సరుకులు పంపిణీ చేయాలి

- రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు



మాట్లాడుతున్న దివి లీలా మాధవరావు

విజయనగరం రూరల్: ప్రజా పంపిణీ వ్యవస్థలో గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఎండీయూ వ్యవస్థ అవినీతి మయంకావడంతో రద్దు చేసి పాత పద్ధతిలో సరుకులు పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు కోరారు. శనివారం విజయ నగరం పెన్షనర్ల సంఘ భవనంలో జిల్లా రేషన్ డీలర్ల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ డీలర్ల వ్యవస్థను నాశనం చేసేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కంకణం కట్టుకున్నారన్నారు. డీలర్లకు ఇస్తున్న కమీషన్ పెంచాలన్నారు. అనంతరం జిల్లా రేషన్ డీలర్ల సంఘానికి కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా రామారావు, కార్యదర్శిగా ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యవర్గంతో పాటు, మండల కార్యవర్గ సభ్యులను ప్రకటించారు.

- **శృంగవరపుకోట:** రేషన్ డీలర్ల సంఘ జిల్లా ప్రధానకార్యదర్శిగా ఎస్.కోటకు చెందిన కె.ఉమామహేశ్వరరావు ఎన్నికయ్యారు. కోశాధికారిగా ముత్యాలు నాయుడు, కార్యదర్శులుగా రాంలింగఈశ్వర్, గోపీకృష్ణ, ఉపకార్యదర్శిగా గౌరీలు ఎన్నుకున్నారు.

సిరిమానోత్సవానికి ప్రత్యేక రైళ్లు నడపండి

విజయనగరం రూరల్: విజయనగరంలో అక్టోబరు నెల 13, 14 తేదీల్లో జరగనున్న పైడిమాంబసిరిమానోత్సవానికి భక్తులు వివిధరాష్ట్రాల నుంచి రానున్న నేపథ్యంలో ప్రత్యేక రైళ్లు నడపాలని పైడిమాంబ దేవస్థానం ఈవో డీవీ ప్రసాదరావు కోరారు.ఈ మేరకు విశాఖ డీఆర్‌ఎంకు లేఖ రాశారు. తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ తదితరప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లు నడపాలని కోరారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని డీఆర్‌ఎం చెప్పారని ఈవో ప్రసాదరావు తెలిపారు.

మహిళా సమాఖ్య మండల కార్యవర్గ ఎన్నిక

రాజాం: రాజాంలో మహిళా సమాఖ్య మండల కార్యవర్గం శనివారం ఏరియా కోఆర్డినేటర్ చిరంజీవి అధ్యక్షతన జరిగింది.అధ్యక్షురాలిగా కంచరాం గ్రామానికి చెందిన రౌతు వెంకటమ్మ, ఉపాధ్యక్షులుగా బొద్దాంకు చెందిన మద్దు జ్యోతి, కార్యదర్శిగా పొట్నూరు పైడితల్లి, సహాయ కార్యదర్శిగా టంకాల స్వాతి, కోశాధికారిగా కొయ్యాన పార్వతులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు అప్పలనాయుడు, టి.దదికుమార్, కె.హేమలత, వి.సుధాకర్ పాల్గొన్నారు.

మార్పు రాకపోతే గుణపాఠం తప్పదు

- బొబ్బిలి టీడీపీ పట్టణాధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు

బొబ్బిలి: వైఖరిలో మార్పు రాకపోతే మునిసిపల్ చైర్మన్‌కు గుణపాఠం తప్పదని టీడీపీ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలరు రాంబార్కి శరత్‌బాబు, మున్సిపల్ ఫ్లోర్‌లీడరు గెంబలి శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడుతూ మూడున్నరేళ్లలో మునిసిపాలిటీలో ఎటువంటి అభివృద్ధి చేయలేదు సరికదా అవినీతిమయంచేశారని ఆరోపించారు. మూడు నెలల కిందట ఎమ్మెల్యే బేబీనాయన అనేక ప్రతిపాదనలు చేశారని తెలిపారు. మునిసిపల్ చైర్మన్ అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు.ఎమ్మెల్యే చెబితే తామెందుకు చేయాలన్న నిర్లక్ష్యం చూపుతున్నారన్నారు. ఇంకా వైసీపీయే అధికారంలో ఉన్నట్లుగా భ్రమపడుతుండడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు వెలగాడ హైమావతి, కాకల గోవిందమ్మ, సాలా రమేష్ పాల్గొన్నారు.

కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాలి

- సత్యదివ్య అమృతం పీఠాధిపతి సాయిస్వామి



మాట్లాడుతున్న సాయిస్వామి

రామభద్రపురం: కష్టాల్లో ఉన్న నిరుపేదలు, అభాగ్యులను ఆదుకోవడమే భగవంతుని సేవగా ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని సత్యదివ్య అమృతం పీఠాధిపతి సాయిస్వామి తెలిపారు. శనివారం రామభద్రపురంలోని గిరిజా రామలిం గేశ్వరస్వామి ఆలయంలో తొలుత పూజారి బాదంపూడి శ్రీనాగరామలింగేశ్వర శర్మ(నాగబాబు) ఆధ్వర్యంలో సాయిస్వామికి స్వాగతం పలికారు.అనంతరం సాయిభక్తులను ఉద్దేశించి మాట్లాడారు. తాటిపూడి ప్రాంతాన్ని రెండో పుట్టపర్తిలా చేయడమే తన అభిలాష అని, ఈ ప్రాంతంలో రూ.120 కోట్లతో నాలుగు ఎకరాల్లో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. బాడంగికి చెందిన శంకరస్వామి ఆధ్వర్యంలో రామభద్రపురం, నాయుడువలస, గొల్లాది, కామన్నవలసలకు చెందిన మహిళా బృందాలు తప్పెడగుళ్లు, బిందెల డ్యాన్స్‌లతో స్వామిని ఊరేగింపుగా ఈశ్వరాలయానికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో రామమూర్తి, కొల్లకూరి విజయదుర్గశాస్త్రి పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు రూ.25 వేలు విరాళం

విజయనగరం రూరల్: విజయనగరంలోఅన్నక్యాంటీన్ల నిర్వహణకు నగరంలో గూడ్‌షెడ్ ప్రాంతానికి చెందిన పీజే పట్నాయక్ రూ.25 వేలు చెక్కును ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు శనివారం పార్టీ కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.రాజేష్‌వర్మ, షైలిపిల్లి పైడిరాజు, రాజనాయుడు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

బాడంగి: భారీ వర్షాలు కురుస్తుండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కె.సుధాకర్ కోరారు. శనివారం పాల్తేరు సమీపంలో వేగావతినదిని నీటి ప్రవాహాన్ని పరిశీలించారు.ఆయనవెంట ఆర్ఐ సోమయ్య, వీఆర్వో సురేష్ ఉన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

బొబ్బిలి రూరల్: బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలో తుఫాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఎం.శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారిందని, విశాఖపట్నం, గోపాలపురం మధ్య కళింగపట్నం దగ్గరలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ కేంద్ర హెచ్చరిక జారీచేసిందని పేర్కొన్నారు.ఈ మేరకు సీనియర్ అసిస్టెంట్ మరిపి కృష్ణమూర్తిని కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జిగా నియమించినట్లు తెలిపారు. ఎక్కడైనా ఇబ్బంది ఏర్పడితే కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 9182881540కు సంప్రదించాలని కోరారు.

- **రాజాం రూరల్:** రాజాం మునిసిపల్ కార్యాలయంలో కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ రామఅప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం శ్రీకాకుళం జిల్లాలోని కళింగపట్నం వద్ద తీరం దాటుతున్న దృష్ట్యా కలెక్టర్ అంబేడ్కర్, రాజాం ఎమ్మెల్యే మురళీమోహన్ సూచనల మేరకు కాల్‌సెంటర్ ఏర్పాటు చేశామని వివరించారు. మునిసిపాలిటీ పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరిగితే 9959226621 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.
- **రాజాం:** తుఫాన్‌ప్రభావం వల్ల ప్రజలకు అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ కృష్ణంరాజు, ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదేశించారు. రాజాంలో కార్యదర్శులు, వీఆర్వోలతో సమీక్షించారు. ఎక్కడైనా ఎటువంటి హాని జరిగినా తక్షణమే సమాచారం అందించాలని కోరారు.

ఆదిభట్ల జయంత్యుత్సవాలు ప్రారంభం

విజయనగరం రూరల్: విజయనగరం కళలకు కాణాచి అని ఎమ్మెల్యే ఆదితి గజపతిరాజు తెలిపారు. శనివారం సాయంత్రం రంగారావు దొర అధ్యక్షతన విజయనగరంలో హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు జయంత్యుత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి.ఆదిభట్ల నారాయణదాసు జయంత్యుత్సవాలు పురస్కరించుకుని రచయితలు, సాహితీ వేత్తలు, హరికథకులు, నగర ప్రముఖులు తొలుత కానుకుర్తివారు వీధిలో ఉన్న ఆయన నివాసంలో ఆదిభట్ల నారాయణదాసు చిత్రపటానికి,మహారాజా ప్రభుత్వ సంగీత నృత్యకళాశాలలో దాసు విగ్రహానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మహారాజా లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో హరికథ గానం నిర్వహించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి హరికథ కథకులు వచ్చి హరికథా గానం చేశారు. తొలి రోజు శ్రీరామ జననం హరికథ గానం జరిగింది. సర్వరాయ హరికథా పాఠశాల విద్యార్థిగానం చేశారు. ఈ సందర్భంగా హరికథా భాగవతారిణి దాలిపర్తి ఉమామహేశ్వరిని సన్మానించారు. కార్యక్రమంలో సతీష్, సుధాకర్ పాల్గొన్నారు.

అదనపు ఎస్పీకి వీడ్కోలు

విజయనగరం క్రైం: జిల్లా అదనపు ఎస్పీగా ఆస్మాపరహీన్ సేవలు అభినందనీయమని ఎస్పీ వకుల్ జిందాల్ కొనియాడారు. బదిలీపై వెళ్లిన ఆస్మాపరహీన్ వీడ్కోలు సభ నిర్వహించారు. ఉద్యోగ విరమణ చేసిన ఏఆర్ ఏఎస్పీ ఎంఎం సోల్మాన్ అభినందించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, డీటీసీ డీఎస్పీ వీర కుమార్, సీఐలు విజయనాథ్, లీలారావు, మురళి, ఆర్ఐలు గోపాలనాయుడు, రమేష్‌కుమార్, భగవాన్ పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

రామభద్రపురం: మండలంలో సోమవారం నుంచి జరగనున్న రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ ఆకుల సులోచనారాణి కోరారు. శనివారం రామభద్రపురంలో విలేకరులతో మాట్లాడుతూ 32 రోజులపాటు సదస్సులు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పీటీసీ సీఐ సత్యశివప్రకాష్‌కు బదిలీ

విజయనగరం క్రైం: విశాఖ రేంజ్, విశాఖ సిటీ పరిధిలో శనివారం చేపట్టిన సీఐల బదిలీల్లో ఇద్దరికి స్థానచలనం కలిగింది. డీసీఆర్‌బీలో సీఐగా విధులు నిర్వహిస్తున్న జె.మురళికి విశాఖ సిటీలోని ఎంవీపీ పోలీసు స్టేషన్ లా అండ్ ఆర్డర్, విజయనగరం పీటీసీలో సీఐగా విధులు నిర్వహిస్తున్న వి.సత్యశివప్రకాష్ విశాఖ సిటీలోని నార్త్ క్రైం సబ్ డివిజన్‌కు బదిలీ చేస్తూ విశాఖ సిటీ కమిషనర్ శంకాబ్రత బాగ్చీ ఉత్తర్వులు జారీ చేశారు.

విజయనగరం ఎంపీడీవోగా చంద్రకళ

విజయనగరం రూరల్: విజయనగరం ఎంపీడీవోగా చంద్రకళ శుక్రవారం మండల పరిషత్‌లో బాధ్యతలు స్వీకరించారు. భోగాపురం ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా విజయనగరం బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన గంటా వెంకటరావు అనారోగ్య కారణాలతో ప్రస్తుతం సెలవులో ఉన్నారు.

పేదరికంలో నిరుద్యోగ యువత

బొబ్బిలి రూరల్: దేశంలో ఉన్నత అర్హత కలిగిన నిరుద్యోగ యువత పేదరికంలో ఉందని మానవ హక్కుల వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ బంకురు జోగినాయుడు తెలిపారు. శనివారం బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడుతూ దేశ సంపదను సామ్రాజ్యవాదులు, ధనికులకు ప్రధాని నరేంద్ర మోదీ దార పోస్తున్నారని ఆరోపించారు.

ప్రధాన అర్చకుడి మృతి

బొబ్బిలి: బొబ్బిలిలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు భద్రం అప్పలాచార్యులు (66) శనివారం మృతిచెందారు. మూడు దశాబ్దాలుగా ఆయన ఆలయంలో అర్చకత్వం నిర్వహిస్తున్నారు. బొబ్బిలి రాజుల పురోహితునిగా, హవల్దారుగా కూడా అప్పలాచార్యులు కొన సాగుతున్నారు. అప్పలాచార్యులకు భార్య లక్ష్మీనరసమ్మ, ఇద్దరు కుమారులు జగదీశ్‌కుమార్, శ్రీకాంత్ ఆచార్యులు, కుమార్తె ఉన్నారు. కాగా ఎమ్మెల్యే బేబీనాయన అప్పలాచార్యుల భౌతికకాయానికి నివాళులర్పించారు.

చెరకు రైతులను ఆదుకోవాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బొబ్బిలి: తమిళనాడులో చెరకు రైతులకు అక్కడ ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోందని, రాష్ట్రంలో కూడా చెరకు రైతులను అదే తరహాలో ఆదుకోవాలని సంకిలి ఈఐడీ ప్యారీ షుగర్ ఫ్యాక్టరీ అధికారులు కోరారు. బొబ్బిలి కోటలో శనివారం ఎమ్మెల్యే బేబీనాయనను కలిసి వారు వినతిపత్రం సమర్పించారు. కాగా చెరకు రైతులకు మేలు చేసేందుకు ఎటువంటి అవకాశాలు ఉన్నా వాటిని ప్రవేశపెట్టాలని సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులను స్వయంగా కోరుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఇంటింటా సర్వే చేయాలి

లక్కవరపుకోట: వర్షాల వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి బి.అనీల్‌కుమార్ కోరారు. సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింట సర్వే చేసి వ్యాదులుప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

టీడీపీ పటిష్టతకు కృషి

బాడంగి: పార్టీ పటిష్టతకు మరింత కృషి చేస్తానని టీడీపీ బీసీ సాధికారిత జిల్లా కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు తెలిపారు. మన టీడీపీ యాప్ ద్వారా కంటెంట్‌ను షేర్ చేయడంలో ప్రథమస్థానంలో నిలిచిన తననుగుర్తించి అభినందించిన పార్టీకి రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం బొబ్బిలిలో ఎమ్మెల్యే బేబీనాయన చేతులమీదుగా ప్రశంసాపత్రం, మెమొంటో అందుకున్నారు.

జీతాలు చెల్లించండి

జియ్యమ్మవలస: తమకు రావల్సిన జీతాలను చెల్లించాలని కోరుతూ చినమేరంగి సీహెచ్‌సీ శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది శనివారం స్థానిక ఆస్పత్రి వద్ద నిరసన తెలియజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత 13 రోజులుగా వీరు జిల్లా వ్యాప్తంగా దశలవారీగా నిరసనలు తెలియజేస్తూ వస్తున్నారు. ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబ భారంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు వీరికి రావల్సిన పీపీ నెంబర్లు, హెల్త్ కార్డులు, ఈఎస్ఐ ఇంకా రాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వి.క్రాంతికుమార్, శానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు.

నిలకడగా నాగావళి


స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు విడుదల చేసిన వరద ప్రవాహం

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో వరద ప్రవాహం నిలకడగా ఉంది. శనివారం పైప్రాంతాల నుంచి 1,500 క్యూసెక్కుల వరద ప్రవాహం నదిలోకి చేరింది. అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి 105 మీటర్లకు గాను 103.70 మీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉంది. అలాగే 2.534 టీఎంసీలకుగాను 1.731 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాగునీటి అవసరాల నిమిత్తం ప్రధాన కాలువల నుంచి 1469 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే స్పిల్‌వే గేట్ల నుంచి 500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అధిక వరద ప్రవాహం వచ్చే పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. అధిక వరద ప్రవాహం వచ్చినట్లయితే దిగువకు మళ్లించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని ప్రాజెక్టు డీఈ టి.రాఘునాధనాయుడు, జేఈలు కె.శ్రీనివాసరావు, బి.కిషోర్‌కుమార్ తెలిపారు.

సింగిల్ విండోలో గణేష్ ఉత్సవాలకు అనుమతి

సీతానగరం: ఎస్పీ ఆదేశాల మేరకు వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు మంజూరు చేస్తున్నామని ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గణేష్ ఉత్సవ అనుమతికి నెట్‌లో నమోదు చేసుకోవడం గానీ, 7995095800 సెల్ నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వడం గానీ చేయవచ్చని తెలిపారు. అధికారుల పరిశీలన తర్వాత నిర్వాహకులకు క్యూఆర్ కోడ్ పంపిస్తామని చెప్పారు. ఈ సింగిల్ విండో సిస్టం ద్వారా నిజమజ్జనం తేదీ, స్థలం, విగ్రహం ఎత్తు, నిర్వాహకుడి వివరాలన్నీ కలిపి మొత్తం సమాచారం ఒకే చోట నిక్షిప్తమై ఉంటుందని తెలిపారు.

సారా తయారీ ముడి పదార్థం స్వాధీనం

గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట పంచాయతీ కాపుగూడ గ్రామ పొలిమేరలోని అటవీ ప్రాంతంలో సారా తయారీకి ఉంచిన ముడి పదార్థాన్ని ఎల్విన్‌పేట పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఈ ప్రాంతంలో పోలీసులు దాడి చేశారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల సారా ముడి పదార్థం గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

పీహెచ్‌సీకి రోగుల తాకిడి

పాచిపెంట: వాతావరణంలో మార్పులు కారణంగా స్థానిక పీహెచ్‌సీకి రోగుల తాకిడి పెరిగింది. శనివారం స్థానిక పీహెచ్‌సీలో 130 మంది రోగులు వైద్య సహాయం పొందారు. వైద్యుడు రవిచంద్ర రోగులకు వైద్య సహాయం అందించారు. ఎక్కువ మంది వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారని ఆయన తెలిపారు. అవసరమైనవారికి రక్త పరీక్షలు చేస్తున్నామని చెప్పారు.

గులిరాగి విధానంతో మేలు


అవగాహన కల్పిస్తున్న ఏవో తిరుపతిరావు

పాచిపెంట: గులిరాగి పద్ధతిలో సాగు చేస్తే సైకిల్ వీడర్‌తో సులువుగా కలుపు తొలగించ వచ్చని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు తెలిపారు. పెదకంచూరులో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన గులిపద్ధతిలో చోడి పంట పండించే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలను వరుసలలో వేసుకుంటే తేలిక నేలలో సైకిల్ వీడర్‌తో కలుపు నివారణ సులువుగా చేసుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు సురేష్‌కుమార్, విజయరాజు, రైతులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

సాలూరు రూరల్: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సాలూరు పట్టణ సీఐ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. సాలూరు ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం ఆయన విద్యార్థులకు చైతన్యసదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. ఆశతో సైబర్ నేరాల ఉచ్చులో పడొద్దన్నారు. 24 గంటల్లో ఫిర్యాదు చేస్తే ఫలితం ఉంటుందని చెప్పారు. ప్రిన్సిపాల్ ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి


రెస్కో ఎండీతో మాట్లాడుతున్న రామ్‌మల్లిక్‌నాయుడు

చీపురుపల్లి: చీపురు పల్లి ఆర్‌ఈసీఎస్‌లో పని చేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని ఆర్‌ఈసీఎస్ జేఎల్‌ఎంలు, వీఈడబ్ల్యూలు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు వారంతా శనివారం చీపురుపల్లిలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడును కలిశా రు. గత కొంత కాలంగా ఆర్‌ఈసీఎస్‌లో జేఎల్‌ఎంలుగా 33 మంది, వీఈడ బ్ల్యూలుగా 24 మంది సేవలందిస్తున్నామని చెప్పారు. సంవత్సరాలు గడుస్తున్నా, తమకు పదోన్నతులు రాలేదన్నారు. జేఎల్‌ఎంలకు సహాయ లైన్‌మన్‌గా, వీఈడబ్ల్యూలకు జేఎల్‌ఎంలుగా తక్షణమే పదోన్నతులు కల్పించాలని కోరారు. దీనికి స్పందించిన రామ్‌మల్లిక్ నాయుడు.. ఆర్‌ఈసీఎస్ ఎండీ పి.రమేష్‌ను తన కార్యాలయానికి పిలిపించి, మాట్లాడారు. సిబ్బంది కోరుతున్నట్టు పదోన్నతులకు ఆటంకం ఏముందని ప్రశ్నించారు. దీనికి ఎండీ రమేష్ మాట్లాడుతూ, ప్రస్తుతం సంస్థ ఈపీడీసీఎల్ పర్యవేక్షణలో పని చేస్తున్నందున, తాను సంబంధిత అధికారులతో మాట్లాడవలసి ఉందన్నారు. నాలుగు రోజుల్లో వారితో చర్చించి సాధ్యాసాధ్యాలను తెలియజేస్తానన్నారు. రామ్‌మల్లిక్‌నాయుడును కలిసిన వారిలో రెస్కో ఉద్యోగుల సంఘం ప్రతినిధి ఎస్.రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

తాటికలప అక్రమ రవాణా అడ్డగింత


కలపతో ఉన్న లారీని అడ్డుకున్న రోడ్డు భవనాల శాఖ సిబ్బంది

మెంటాడ: పిట్టాడ గ్రామం నుంచి తాటికలపను లారీలో అక్రమంగా తరలిస్తుండగా ఆర్‌అండ్‌బీ జేఈ నరసింహ మూర్తి, సిబ్బంది శనివారం అడ్డుకున్నారు. దీనిపై అక్రమ రవాణాదారులను ప్రశ్నించగా.. తాము ఇతర రాష్ట్రం నుంచి వచ్చామని, చిన్నచిన్న కుటీరాల ఏర్పాటుకు ఈ తాటి కలపను వినియోగిస్తామని చెప్పారు. దీనికోసం రహదారి పక్కన ఉన్న చెట్లతో పాటు రైతులతో మాట్లాడి వారి స్థలాల్లోని చెట్లను కూడా సేకరించినట్టు తెలిపారు. ఈ లారీని ఆంధ్ర పోలీసులకు శనివారం జేఈ నరసింహమూర్తి అందించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పట్టుబడిన తాటికలప ప్రభుత్వ ఆస్తి అని, వాటికి త్వరలో వేలంపాట నిర్వహిస్తామని చెప్పారు. దీనిపై ఎస్ఐ దేవి వివరణ కోరగా.. జేఈ నరసింహమూర్తి తమకు ఫిర్యాదు చేసినప్పటికీ, కేసునమోదు చేయవద్దని చెప్పారని తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- జిల్లాలో ఒక రోజు ముందు పింఛన్ల పంపిణీ
- పాల్గొన్న కూటమి నాయకులు

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రజాప్రతినిధులు అన్నారు. జిల్లా వ్యాప్తంగా శనివారం సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఒకటో తేదీ ఆదివారం సెలవుదినం కావడంతో ఒక రోజు ముందుగా శనివారం పంపిణీకి చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యేలు, నాయకులు, అధికారులు లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


గరుగుబిల్లి: రావివలసలో పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ అరకు పార్లమెంటు కార్యదర్శి భరత్‌కుమార్


కురుపాం: పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు


మక్కువ: పార్వతీపురం ఏరియా ఆసుపత్రిలో లబ్ధిదారునికి పింఛన్ అందిస్తున్న దృశ్యం

రసాభాసగా మున్సిపల్ సమావేశం

- చైర్‌పర్సన్ గౌరీశ్వరీ వైఖరిపై నిప్పులు చెరిగిన వైసీపీ కౌన్సిలర్లు

పార్వతీపురంటౌన్: మున్సిపాల్టీకి ప్రథమ పౌరురాలిగా ఉంటూ కౌన్సిల్ సభ్యుల అభిప్రాయాలతో పాటు సలహా, సూచనలు, నిర్ణయాలను పట్టించుకోకపోవడం విచారకరమని వైసీపీ కౌన్సిల్ సభ్యులు.. అదే పార్టీకి చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీపై నిప్పులు చెరిగారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గౌరీశ్వరీ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే చైర్‌పర్సన్ తీరుపై ఫ్లోర్‌లీడర్ ఎం.రవికుమార్‌తో పాటు పలువురు కౌన్సిల్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గత సమావేశంలో కూడా తామంతా అజెండాలోని అంశాలను వ్యతిరేకిస్తే ఒక్క చైర్‌పర్సనే ఆమోదం తెలపడం సరికాదన్నారు. చైర్‌పర్సన్, మున్సిపల్ అధికారుల తీరుపై నిరసిస్తూ వైసీపీ కౌన్సిల్ సభ్యులు సమావేశ మందిరం నుంచి వాకౌట్ చేశారు. దీనికి ఎమ్మెల్యే, మున్సిపల్ ఎక్స్‌అఫీషియో సభ్యుడు విజయచంద్ర స్పందిస్తూ రాజకీయాలకు అతీతంగా ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో పాలన సాగుతుందన్నారు.

టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం

ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారుల వ్యవహార శైలిపై కౌన్సిల్ సభ్యులు ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాల్టీలోని 30 వార్డుల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారని 8వ, 21వ వార్డుల కౌన్సిల్ సభ్యులు కోరాడ నారాయణరావు, బడే గౌరునాయుడు ఆరోపించారు. బైపాస్ రహదారిలోని డీపట్టా భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకునే వారే లేరన్నారు. జగనన్న లేఅవుట్లలో అక్రమ కట్టడాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో 5 నుంచి 7 రోజులకొకసారి తాగునీటి సరఫరా చేస్తున్నారని, దీనికి ఇంజినీరింగ్ అధికారుల ముందస్తు ప్రణాళికలు లేకపోవడమేనని కౌన్సిల్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు స్పందిస్తూ కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నాయని, తమ ఇంజినీరింగ్ అధికారులకు ఐదు రోజులు సమయం ఇస్తే తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని చెప్పారు.


సమావేశంలో సమస్యలు వివరిస్తున్న 14వ వార్డు కౌన్సిలర్ శ్రీదేవి

14 వార్డు ప్రజలు ఏం పాపం చేశారు?

గత మూడేళ్లుగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 14వ వార్డులో కనీసం సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టం కనిపిస్తుందని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, ఆ వార్డు కౌన్సిలర్ ద్వారపురెడ్డి శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. అజయ్‌నగర్, రామానందనగర్‌లో కాలువల నిర్మాణం అస్తవ్యస్తంగా ఉండడంతో వర్షాకాలంలో ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

జిల్లా కేంద్ర అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. మున్సిపాల్టీలోని 30 వార్డుల అభివృద్ధి కోసం మున్సిపల్ శాఖా మంత్రి నారాయణకు మరిన్ని ఎక్కువ నిధులు కేటాయించాలని కోరామని చెప్పారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు, ప్రజల సహకారంతోనే మున్సిపాల్టీ అభివృద్ధి సాధ్యమన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన కాంట్రాక్టు ఉద్యోగుల్లో 27 మంది అర్హులా కాదా.. అనేదానిపై సమగ్ర విచారణ చేపడతామని తెలిపారు.

వర్షాలతో రహదారులు జలమయం


గరుగుబిల్లి: రావివలసలో రహదారిపై నీరు చేరిన దృశ్యం, సీతంపేటలో..

గరుగుబిల్లి: అల్పపీడనం కారణంగా గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. మండలంలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. రావివలసలోని ప్రధాన వీధుల్లో వర్షపు నీరు నిల్వ నెలకొనడంతో కొంతమేర అసౌకర్యానికి గురయ్యారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న హెచ్చరికలతో రైతుల్లో దిగులు నెలకొంది. ● **సీతంపేట:** మండల కేంద్రంలో శనివారం ఎడతెరిపి లేని వర్షం కురిసింది. రైతులు హర్షం వ్యక్తం చేశారు.

తుఫాన్ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తం


శివరాంపురం వద్ద నదీ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమణ

సాలూరు రూరల్: తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో జిల్లాలో అన్ని శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ అప్రమత్తం చేశారు. ఈ మేరకు సాలూరు తహసీల్దార్ ఎన్వీరమణ సాలూరు మండలంలో వేగావతి, సువర్ణముఖి, వట్టిగెడ్డ, గోముఖి తదితర నదులు, వివిధ వాగుల పరిస్థితులపై వీఆర్వోలతో శనివారం సమీక్షించా రు. శివరాంపురం వద్ద వేగావతి నది ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. పెదగెడ్డ రిజర్వాయర్ గేట్లు ఎత్తితే ప్రమాదకరంగా ప్రవహించడంపై అంచనా వేశారు. కాజ్‌ను దాటొద్దని అక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. వివిధ మండలాల తహసీల్దార్లు తమ పరిధిలో ఉన్న నదులు, వాగుల పరిస్థితిపై సమీక్షించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వీరఘట్టం: మండలంలోని వర్షాలు కారణంగా లోతట్టు ప్రాంతాల్లోని, నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు. ఆయా గ్రామాల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వర్షాలు మరో మూడు రోజుల పడే అవకాశాలు ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు


ఎన్నికల్లో పాల్గొన్న అధికారులు, తల్లిదండ్రులు

జియ్యమ్మవలస: మండలంలో ఎంపీ ప్రాథమిక పాఠశాల (ఆర్), పెదబుడ్డిడిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు శనివారం ప్రశాంతంగా నిర్వహించా రు. ఎంఈవో-2 ముదిలి శ్రీనివాసరావు పర్యవేక్షణలో, జియ్యమ్మవలస పోలీస్‌స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ పి.అనీష్ ఏర్పాటు చేసిన బందోబస్తు నడుమ ఈ ఎన్నికలు జరగడం విశేషం. ఈ పాఠశాలలో 22 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా 20 మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఈ ఎన్నికకు హాజరయ్యారు. స్కూల్ చైర్మన్‌గా రేవళ్ల సాయిరాం, వైస్ చైర్మన్‌గా మజ్జి కరుణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గుంట్రెడ్డి శ్రీనివాసరావు, సీఆర్‌పీ పోలినాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిడగల్లులో..

సీతానగరం: మండలంలోని నిడగల్లు జడ్పీ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ ఎన్నికలు శనివారం నిర్వహించారు. ఈ ఎన్నికలో చైర్మన్‌గా కర్రి రామకృష్ణ, వైస్ చైర్మన్‌గా రేవతితో పాటు 22 మందిని సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు హెచ్ఎం బి.మనోజ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఈ స్కూల్ ఎన్నికలు రెండుసార్లు వాయిదా పడటంతో మూడోసారి ఎటువంటి గొడవలు జరగకుండా ఎన్నిక పూర్తయింది.

జన్‌మన్‌తో గ్రామాభివృద్ధి


గ్రామసభలో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ సత్యం

సీతంపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పీఎం జన్‌మన్ పథకం ద్వారా గిరిజన గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని మండల ఈవోపీఆర్డీ కె.సత్యం అన్నారు. శనివారం మండలంలోని మండ, కిట్టాలపాడు, శిలగాం గ్రామాల్లో జన్‌మన్ గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామసభల్లో ఈవోపీఆర్డీ సత్యం పాల్గొని మాట్లాడారు. జన్‌మన్ పథకం ద్వారా గ్రామాల్లో మంచినీరు, విద్యుత్, రహదారులు, వైద్యం వంటి కనీస సౌకర్యాలు పూర్తి స్థాయిలో కల్పిస్తారని చెప్పారు. ఈ రెవెన్యు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా..

పీఎంజేజేబీవై పథకాన్ని వినియోగించుకోండి

పార్వతీపురంటౌన్: పీఎంజేజేబీవై పథకాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఏపీజీవీబీ ప్రధాన బ్రాంచ్ మేనేజర్ ఉమాదేవి అన్నారు. ఇటీవల అకాల మరణం చెందిన పట్టణానికి చెందిన ఏపీజీవీబీ పాలకొండ రోడ్డు బ్రాంచ్ ఖాతదారుడైన ఈ.శ్రీనివాసరావు, భార్య జయకు పీఎంజేజేబీవై పథకం కింద మంజూరైన రూ.2లక్షల చెక్కును బీఎం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎంజేజేబీవైతో పాటు పీఎంఎస్‌బీవై పథకాలను తెలుసుకోవాలన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు


వైనతేయ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో శనివారం వైనతేయ పూజలు ఘనంగా నిర్వహించా రు. ఆలయ ఆవరణలో ప్రసన్నాంజనేయస్వామికి 15 వేల తమలపాకులు, 550 నిమ్మకాలు, సిందూరం, పంచామృతాభిషేకాలు, పలు రకాల పండ్లతో ప్రత్యేక పూజలు చేశారు.

స్వచ్ఛందంగా పాఠశాల రహదారి శుభ్రం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బి.గౌరీశంకరరావు పిలుపుమేరకు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల రహదారిని స్థానికులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శనివారం శుభ్రంచేశారు. ఈ కార్యక్రమంలో అన్ని సంఘాల సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు. చెత్తనంతా తీసివేసి ట్రాక్టర్లతో వేరే దగ్గర డంప్ చేశారు. ఆ ప్రాంతంలో మొక్కలు కూడా నాటడానికి నిర్ణయించారు. ఈ పరిసర ప్రాంతాల్లో ఎవరూ చెత్తవేయకూడదని తీర్మానించారు.

డిగ్రీ కళాశాలలో జాతీయ కార్యగోష్ఠి

పాలకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా వారోత్సవాల్లో భాగంగా వ్యాయామ విద్యా విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంబాబు అధ్యక్షతన శనివారం జాతీయ కార్యగోష్ఠి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్ ఎస్.జైరామన్, ప్రముఖ ఫిట్‌నెస్ ట్రైనర్ మోహన్‌లాల్ ఇంటర్నెట్ ద్వారా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ శ్యాంబాబు మాట్లాడుతూ క్రీడలు శారీరక ఆరోగ్యానికి మాత్రమే కాకుండా మానసిక ఆరోగ్యానికి ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.రాజు, కళాశాల వ్యాయామోపాధ్యాయులు సీతారాం పాల్గొన్నారు.

3న చీపురుపల్లిలో జాబ్ మేళా

చీపురుపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబరు 3న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సి పాల్ డా.పీవీ కృష్ణాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ వరకూ అర్హతలున్న వారు, ఐటీఐలో ఉత్తీర్ణత సాధించినవారు ఈ మేళాకు అర్హులన్నారు. వయసు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఈ మేళాకు నాలుగు బహుళ జాతి కంపెనీలు హాజరవుతాయని తెలిపారు. ఇతర వివరాల కోసం 9010023033 నెంబరుకు సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

చింతలపేటలో వైద్య శిబిరం

గుర్ల: చింతలపేట గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ఇంటింటికి వెళ్లి జ్వరాలు ఉన్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

పాలకొండ: పట్టణంలోని నాగవంశపువీధిలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక శ్రీకాకుళం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలు శనివారంతో ముగిశాయి. ఈసందరంగా ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఎస్ఐ ప్రయోగమూర్తి పాల్గొని, పల్లకీ మోశారు. ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


శ్రీకృష్ణ ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్యే విజయచంద్ర
- పవన్‌కల్యాణ్ జన్మదినోత్సవాల్లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాలు

పార్వతీపురంటౌన్/ బెలగాం: పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పిలుపునిచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు ఉత్సవాల్లో భాగంగా జనసేన పార్టీ నాయకులు ఎ.మోహన్‌రావు, సీహెచ్.అనిల్ ఆధ్వర్యంలో శనివారం పార్వతీపురంలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అలాగే పట్టణంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ● **కురుపాం:** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడకల్లో భాగంగా జనసేన పార్టీ నాయకుడు ఎస్. వంశీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాయంలో తహసీ ల్దార్ రవణమ్మ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. జనసైనికులు శ్రీరామ్, మురళి, రవి, ప్రసాద్, రాధాకృష్ణ, సాయి పాల్గొన్నారు.


పార్వతీపురంటౌన్/ బెలగాం: మొక్క నాటుతున్న ఎమ్మెల్యే


కురుపాం: తహసీల్దార్ కార్యాలయం వద్ద..

సాలూరులో వాలీబాల్ పోటీలు ..

సాలూరు రూరల్: ఆటలకు రాజకీయాలు ఉండవని, క్రీడాస్ఫూర్తితో ఆడాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీభంజ్‌దేవ్ అన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మెగా అభిమానులు నిర్వహిస్తున్న సాలూరులో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలను పట్టణ సీఐ అప్పలనాయుడుతో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు, చిరంజీవి, పవన్‌కల్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ నేత భంజ్‌దేవ్